క్లుప్తంగా

జీతం మంజూరు చేయాలని వినతి



డాక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నవీన

శ్రీశైలంప్రాజెక్ట్: ఏడు నెలల జీతం మంజూరు చేయాలని శ్రీశైలంప్రాజెక్ట్ ప్రభుత్వ ఆసుపత్రి ఆఫీస్ సబార్డినేట్ ఎం.నవీనజ్యోతి గురువారం డాక్టర్.లీలా వినయ్ కుమార్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా జాయిన్ అయినప్పటి నుంచి ఇప్పటి వరకు జీతం అందకపోవడంతో జీవనం కష్టమైందని ఆమె వినతి పత్రంలో పేర్కొంది.

కోలుకోలేక వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



కిరణ్‌కుమార్ రెడ్డి(ఫైల్)

జూపాడుబంగ్లా: వారం క్రితం రోడ్డుప్రమాదంలో గాయపడి కర్నూలులో చికిత్స పొందుతున్న జూపాడుబంగ్లా వైఎస్సార్‌సీపీ నాయకుడు కిరణ్‌కుమార్‌రెడ్డి(48) కోలుకోలేక గురువారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు నందికొట్కూరు విద్యార్థి



చరణ్‌పాల్‌తో యాజమాన్యం

నందికొట్కూరు: జాతీయస్థాయి జంప్ రోప్ పోటీలకు తమ స్కూల్ విద్యార్థి చరణ్‌పాల్ ఎంపికయ్యాడని నందికొట్కూరు జీవన్ జ్యోతి ఇంగ్లీషు మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ జ్యోతిష తెలిపారు. గురువారం ఉపాధ్యాయులు విజిత, శ్రీనివాసులుతో కలిసి ఆమె విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 27, 28 తేదీల్లో నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాందేడ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు.

9లోగా జాబితా ఇవ్వాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్

జూపాడుబంగ్లా: అధికవర్షాల వల్ల పంట నష్టపోయిన రైతుల జాబితాను రూపొందించి ఈనెల 9లోగా సమర్పించాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఏఓ కృష్ణారెడ్డి వీఆర్వోలు, రైతుసేవా కేంద్రాల వ్యవసాయ సిబ్బందికి సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వారు వీఆర్వోలతో సమావేశమయ్యారు. ఈపంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయటంతో పాటు అధిక వర్షాలకు నష్టపోయిన పంటలను గుర్తించి జాబితాను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో డీటీ నాగన్న, ఆర్‌ఐ శ్రీరంగారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సరళ, మండల సర్వేయర్ షహనాపర్వీన్ పాల్గొన్నారు.

మురుగునీరు తొలగించాలి



రోడ్డుపై నిలిచిన నీటిని చూపుతున్న నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని తొలగించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, నాయకులు డి.రామ్‌నాయక్, ఎన్.స్వాములు కోరారు. గురువారం వారు కాలనీ ప్రజలతో కలిసి రోడ్డుపై ఆగి ఉన్న నీటిలో చేపలు పడుతూ నిరసన తెలిపారు.

వర్షపు నీరు తొలగింపు



ఆయిల్ ఇంజన్‌తో వర్షపు నీటిని తొలగిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల ఎస్సీ కాలనీలో ఉన్న పాఠశాల వద్ద నిలిచిన వర్షపు నీటిని పంచాయతీ కార్యదర్శి చాందిని, ఎంపీపీఎస్ స్పెషల్ స్కూల్ చైర్మన్ ఎస్.యేసేపు గురువారం ఆయిల్ ఇంజన్‌తో తొలగించారు. మోకాలు లోతులో నిలిచిన నీటిని తొలగించడంతో విద్యార్థులు, హెచ్‌ఎం లోకేంద్రనాథ్ కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి

నందికొట్కూరు: పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు గురువారం మున్సిపల్ కమిషనర్ బేబికి వినతి పత్రం అందజేశారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని వీధులు అపరిశుభ్రంగా మారాయని, ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందని, సిబ్బందితో వెంటనే పారిశుద్ధ్య పనులు చేయించాలని కోరారు.



జూపాడుబంగ్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం



పగిడ్యాల: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి



కొత్తపల్లి: గువ్వలకుంట్లలో రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా గురుపూజోత్సవం

నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తమ ఉపాధ్యాయులను విద్యార్థులు సన్మానించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాలల్లో పండుగ వాతావరణం కనిపించింది.

– సాక్షి నెట్‌వర్క్



పాములపాడు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ను సన్మానిస్తున్న చైర్మన్, విద్యార్థులు



శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



నందికొట్కూరులో సర్వేపల్లి చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య



ఆత్మకూరు జూనియర్ కళాశాల ఆవరణలో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



మిడుతూరు జెడ్పీ స్కూల్‌లో రిటైర్డ్ హెచ్‌ఎంను సన్మానించిన దృశ్యం



జూపాడుబంగ్లా: రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు



వెలుగోడు: విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు

వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి

- డీఎస్పీ రామాంజినాయక్, ఆర్డీఓ దాస్

ఆత్మకూరు/ఆత్మకూరు రూరల్/వెలుగోడు: వినాయక చవితి వేడుకలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, ఆర్డీఓ దాస్ సూచించారు. గురువారం ఆత్మకూరులోని ఎంఎం ఫంక్షన్‌హాల్, వెలుగోడులోని షిరిడీ సాయిబాబా మందిరంలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశాల్లో వారు మాట్లాడారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వినాయక చవితి వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో వినాయక చవితి పండుగను జరుపుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆత్మకూరు సమావేశంలో తహసీల్దార్ రత్నరాధిక, సీఐలు సురేష్‌కుమార్‌రెడ్డి, ఓబులేసు, ఎస్‌ఐ నారాయణ రెడ్డి, వెలుగోడు సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస గౌడ్, ఎస్‌ఐ విష్ణు నారాయణ, ఈఓ హరిలీల, శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజినాయక్

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న రూరల్ సీఐ సుబ్రమణ్యం

నందికొట్కూరు: వినాయక పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని రూరల్ సీఐ సుబ్రమణ్యం సూచించారు. గురువారం స్థానిక టౌన్ పోలీసు సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వినాయక మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విగ్రహం ఏర్పాటు చేసుకోవాలంటే అనుమతి తప్పని సరిగా తీసుకోవాలన్నారు. నిమజ్జనం రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐ సురేష్‌బాబు పాల్గొన్నారు.

పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలి

కొత్తపల్లి: వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్‌ఐ కేశవ సూచించారు. గురువారం మండల పరిధిలోని శివపురం, గువ్వలకుంట్ల, బిఎన్ పాలెం, గోకవరం గ్రామాల్లో ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. వినాయకచవితి వేడుకల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కమిటీ సభ్యులకు, ప్రజలకు వివరించారు. నిమజ్జన ప్రాంతాలు చెరువులను పరిశీలించారు.



గువ్వలకుంట్లలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ కేశవ

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

- విద్యుత్ ఉండగానే యువకుడిని స్తంభం ఎక్కించిన వైనం
- విద్యుదాఘాతంతో తీవ్ర గాయాలు



విద్యుత్‌షాక్‌తో చేతికి తీవ్ర గాయమైన దృశ్యం

కొత్తపల్లి: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఓ యువకుడి ప్రాణాపాయస్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విద్యుత్ సరఫరా ఉండగానే మరమ్మతుల కోసం యువకుడిని విద్యుత్ స్తంభం ఎక్కించి ప్రమాదానికి కారణమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. ఎడతెరిపిలేని వర్షాలకు మండలంలోని ముసలిమడుగు గ్రామంలో బీసీ కాలనీలో విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. వాటిని పునరుద్ధరించే క్రమంలో విద్యుత్ అధికారులు ఓ కాంట్రాక్టర్ సాయంతో కొత్త స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనికి ఎలాంటి అవగాహన లేని చైతన్యగౌడ్ అనే యువడిని కూలికి బుధవారం పిలుచుకున్నారు. విద్యుత్ స్తంభాలు పునరుద్ధరించిన తర్వాత విద్యుత్ తీగలు బిగించారు. మరమ్మతులు చేస్తున్న సమయంలో విద్యుత్ సరఫరా ఉన్నా యువకుడిని స్తంభం ఎక్కించడంతో విద్యుత్‌షాక్‌తో తలకు, చేతులకు, కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ విషయం బయటికి రాకుండా విద్యుత్ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా యువకుడిని కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు అతడు ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా యువకుడి ప్రాణాలు పోయేవి అని, అయినా విద్యుత్ సరఫరా ఉండగా స్తంభం ఎలా ఎక్కించారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఏఈ అబీద్‌ను వివరణ కోరగా.. ఆ విషయం తమకు తెలియదని, కాంట్రాక్టర్‌కే సంబంధమని తోసి పుచ్చడం గమనార్హం.

రైతు సంక్షేమానికి పెద్ద పీట

- ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

మిడుతూరు: రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. గురువారం మిడుతూరులో వ్యవసాయ పరిశోధన సంస్థ (హైదరాబాద్) ఆధ్వర్యంలో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రైతులకు మంజూరైన ఉపకరణాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ పరిశోధన సంస్థ చైర్మన్ బాలక్రిష్ణన్, తహసీల్దార్ శ్రీనివాసులు, సర్పంచ్ జయలక్ష్మమ్మ పాల్గొన్నారు.



రైతులకు ఉపకరణాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

మట్టి విగ్రహాలనే పూజిద్దాం

నందికొట్కూరు: మట్టి విగ్రహాలనే కొలువుంచి పూజించాలని ఎమ్మెల్యే జయసూర్య సూచించారు. గురువారం పట్టణంలోని ఆవుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మట్టి విగ్రహాలను ఆయన భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సురేష్‌బాబు, టీడీపీ నాయకులు భాస్కరరెడ్డి, మహేశ్వరరెడ్డి, సురేంద్ర, ఆవుల సంఘం సభ్యులు చలపతిరావు, శేషపణి, సురేష్, ప్రసాద్, శ్రీనివాసులుశెట్టి, ఓంకారమయ్య, గిరిధర్‌బాబు పాల్గొన్నారు.

సమావేశాలు నిర్వహించండి

పాములపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి నిర్వాహక కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించాలని తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీఓ గోపీక్రిష్ణ, ఎస్‌ఐ సురేష్‌బాబు సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, వీఆర్వోలతో వారు సమావేశమై మాట్లాడారు. వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలన్నారు.

వ్యక్తి అదృశ్యం



వెంకటేష్(ఫైల్)

కొత్తపల్లి: మండల కేంద్రంలోని భ్రమరాంబా చెంచుగూడేనికి చెందిన కుడుముల వెంకటేష్ అదృశ్యమైనట్లు పోలీసులు నమోదు చేశారు. ఈనెల 1న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాకపోవడంతో తెలిసిన చోటల్లా వెతికిన కుటుంబ సభ్యులు.. ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. భార్య రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.కేశవ తెలిపారు.

మహానందిలో ఉద్యోగుల అంతర్గత బదిలీలు

మహానంది: మహానంది దేవస్థానంలో పని చేస్తున్న రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్, ఏజెన్సీ ఉద్యోగుల విధులను మారుస్తూ ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. టెంపుల్ పర్యవేక్షకుడిగా శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లుగా ఉదయం షిఫ్ట్‌లో ఆర్‌ఎస్ శ్రీనివాసులు, మధ్యాహ్నం షిఫ్ట్‌లో హరినాథ్‌లను నియమించారు. ఇంజనీరింగ్ విభాగానికి మల్లికార్జునయ్య, డిశ్చాచ్, లావాదేవీల విభాగానికి శిరీష, అన్నప్రసాదం విభాగానికి రామశివలకు విధులు కేటాయిస్తూ ఆదేశాలు ఇచ్చారు. వీరితో పాటు వివిధ విభాగాల్లో పని చేస్తున్న మరో 30మంది సిబ్బంది విధులను మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు.

పంట నష్టం నివేదికలు తయారు చేయండి

- ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బి.ఆంజనేయ

కొత్తపల్లి: నష్టపోయిన ప్రతి పంట వివరాలు సేకరించి నివేదికలు తయారు చేయాలని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు బి.ఆంజనేయ సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఉమారాణితో కలిసి వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ అధిక వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతుల జాబితాను ఈనెల 10వ తేదీలోపు తయారు చేయాలన్నారు. 11న సామాజిక తనిఖీ నిమిత్తం అన్ని రైతుసేవా కేంద్రాల్లో జాబితాను ప్రదర్శించాలన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే సరిదిద్ది ఈనెల 17న జిల్లా కార్యాలయానికి పంపాలన్నారు. నష్టపరిహారం అంచనా వేసేటప్పుడు 33 శాతం కన్నా ఎక్కువగా పంట దెబ్బతిన్న వాటిని మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి కె.మహేష్, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, వీఆర్వోలు, రైతుసేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కాపురానికి రాలేదని..

- భార్యపై భర్త దాడి

కొత్తపల్లి: మనస్పర్థలతో పుట్టింటికి వెళ్లి తిరిగి రాని భార్యపై భర్త దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామం మజారా గ్రామమైన బండినాయిని పాలెం గ్రామానికి చెందిన శివలింగం, జ్యోతికి 14 ఏళ్ల క్రితం పెళ్లి అయ్యింది. వీరికి ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. అయితే కుటుంబ కలహాల వల్ల భార్యాభర్తలు గొడవపడ్డారు. మనస్తాపంతో జ్యోతిది అదే గ్రామం కావడంతో నాలుగు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి కాపురానికి రమ్మని భార్యను పిలుస్తున్నా రాకపోవడంతో బుధవారం ఆమెపై దాడి చేశాడు. స్థానికులు అడ్డుకుని తీవ్రంగా గాయపడిన ఆమెను ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు. గురువారం ఈ విషయంపై బాధితురాలు జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.కేశవ తెలిపారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

ఆత్మకూరు: నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డీపీఎంఓ డాక్టర్ సునీత సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. కేర్ కాంపెనియన్ ప్రోగ్రాం, సీహెచ్‌ఓ (యంఎల్‌హెచ్‌పీ) విధి విధానాలు, నీటి నాణ్యతా పరీక్షలు, అంటువ్యాధుల నివారణ చర్యలు, మాతా శిశు సంరక్షణ, బడి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు, క్షయ, కుష్టు అనుమానితులను తొలి దశలోనే గుర్తించాలని, ప్రజలు నేత్రదానం చేసేందుకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నజీన్, స్టేట్ కన్సల్టెంట్ శివశంకర్, వెల్‌నెస్ సెంటర్ సూపర్‌వైజర్ శివరామయ్య, కంటి వైద్యులు షేక్షావలి, టీబీ సూపర్‌వైజర్ రవికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఎంఓ డాక్టర్ సునీత

నీటి సరఫరా తగ్గింపు

జూపాడుబంగ్లా: ఐదు రోజుల నుంచి కురుస్తున్న ఎడతెరపిలేని వర్షాల వల్ల కర్నూలు–కడప కాల్వకు సాగునీటి సరఫరాను తగ్గించినట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి వెయ్యి క్యూసెక్కుల నీటిని కేసీ కాల్వలోకి విడుదల చేస్తుండగా లాకిన్స్‌లా వరకు 333 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు తెలిపారు. ఈ నీటిని నిప్పులవాగుకు 223 క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్‌చానల్ కాల్వకు 110 క్యూసెక్కుల చొప్పున సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

హనుమంతుకు నివాళి

పాములపాడు: స్థానిక సీపీఎం కార్యాలయంలో కామ్రేడ్ హనుమంతు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి స్వామన్న, పాత్రికేయులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామికి విశేష పూజలను దేవస్థానం అధికారులు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపల్లి: కేంద్ర ప్రభుత్వ అందించే సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ సుబ్రమణ్యం అన్నారు. గురువారం మండల పరిధిలోని ముసలిమడుగు గూడెంలో ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయమహా అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం గిరిజనులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి ఆవశ్యతపై అవగాహన కల్పించారు. అర్హులైనవారు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ రాజునాయక్, టెక్నికల్ అసిస్టెంట్ బషీరూన్, ఐటీడీఏ చెంచు సమాఖ్య సీసీ యూసూఫ్ పాల్గొన్నారు.

తెలుగుగంగ కాల్వ వద్ద నిమజ్జన ఘాట్

మహానంది: వినాయక చవితిని పురస్కరించుకొని గణేష్ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహానంది సమీపంలోని అయ్యన్ననగర్ వద్దనున్న తెలుగుగంగ కాల్వ వద్ద నిమజ్జన ఘాట్‌ను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా గురువారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వినాయక విగ్రహం చుట్టూ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో మండపాన్ని తయారు చేశారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ గౌరవాధ్యక్షుడు చిన్నకాశయ్య తెలిపారు.

వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

పగిడ్యాల: ఈనెల 7 నుంచి ప్రారంభమయ్యే వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ శివరాముడు, ఏఎస్‌ఐ కృష్ణుడు సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీ సభ్యుల సమావేశంలో వారు మాట్లాడారు. మండపాల వద్ద డీజేలు, లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయరాదన్నారు. సమావేశంలో ఎంఈఓ సుభాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.